క్లుప్తంగా

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి శాశ్వత హుండీ కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి సమక్షంలో ఉదయం 9గంటలకు హుండీ కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలలితకు బాధ్యతలు



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయ లలిత

కూడేరు: మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)గా విధులు నిర్వర్తిస్తున్న ముస్తఫా కమల్ బాషా శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఎంపీడీఓ పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో ఉన్నతాధికారులు వజ్రకరూరు మండలం ఎంపీడీఓ విజయలలితకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలను అప్పగించినట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి.

ఘనంగా ప్రార్థన దినోత్సవం

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి చర్చిలో ప్రపంచ ప్రార్థన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రోగ్రాం డైరెక్టర్ చల్లా కిశోర్, చర్చి పాస్టర్లు డీఎస్ పాల్, ఐసయ్య, ప్రసాద్ ప్రార్థన దినోత్సవం నిర్వహించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా జీవించాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపులో రైతు కావలి దేవేంద్రకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో ఆదివారం ఉదయం మృతిచెందింది. రైతు కావలి దేవేంద్ర ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభానికి ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తెగి గేదెపై పడడంతో మృతిచెందింది. అప్పు చేసి గేదెను కొనుగోలు చేశానని, రూ.50 వేలు నష్టపోయినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

పోతలయ్యస్వామికి పూజలు



పూజలందుకుంటున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గార్లదిన్నెకు చేరుకున్న పాదయాత్ర



జైన మత సిద్ధాంతాలు వివరిస్తున్న దిగంబర స్వామి

గార్లదిన్నె: జైన మత దిగంబర స్వాముల పాదయాత్ర ఆదివారం గార్లదిన్నెకు చేరుకుంది. జైన మతానికి చెందిన అంతర్మాన ప్రసన్న సాగర గురువుతో పాటు 17 మంది దిగంబర స్వాములు కర్ణాటకలోని గోమటేశ్వర స్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని కుల్‌చారమ్ జైన దేవాలయం వరకూ ఏప్రిల్ 25న పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి రాప్తాడులో బస చేసి, ఆదివారం ఉదయం పాదయాత్ర గార్లదిన్నెకు చేరుకుంది. రాత్రికి జిల్లా పరిషత్ హైస్కూల్లో బస చేశారు. అక్కడ భక్తులకు స్వాములు జైన మత సిద్ధాంతాలను తెలియజేశారు. ప్రజలు సంతోషంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

కుండపోత వర్షం .. సాగుకు సన్నద్ధం



ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



బొమ్మనహాళ్‌లో నీట మునిగిన పత్తి పంట



కూడేరు వద్ద వర్షం నీటితో నిండిన చెక్ డ్యాం

రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్/కూడేరు/విడపనకల్లు/కుందుర్పి: వేసవి ముగిసింది. రైతులు ముందుగారు సేద్యాలు చేసుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఇటీవల రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరింది. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

బొమ్మనహాళ్ మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కుండపోతగా వాన కురిసింది. మండలంలో రాత్రి 10 గంటల నుంచి 12.30 గంటల వరకు వర్షం వదిలిపెట్టకుండా కుండపోతగా కురిసింది. దీంతో 27.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి పత్తి పంటలు నీట మునిగింది. పలుచోట్ల వృక్షాలు, విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షానికి కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. శ్రీధరఘట్ట చెరువుకు నీరు చేరాయి.

కూడేరులో 50.4 మి.మీ. వర్షపాతం

కూడేరు మండలంలో జోరుగా వాన కురిసింది. ఉరుములు, శనివారం అర్ధరాత్రి, ఆదివారం వేకువజామున మెరుపులు,ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో వంకలు పారాయి. ఉపాధి హామీ పథకం కింద తవ్విన ఫారంపాండ్లు, చెక్ డ్యాంలు, గుంతలు వర్షం నీటితో నిండాయి. 50.4 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైనట్లు మండల గణాంకాధికారిణి ఆశా ఆదివారం తెలిపారు. 23 మిల్లీమీటర్లు వస్తే ఒక పదును వర్షమని, రెండు పదున్ల కంటే అధికంగానే వర్షం కురిసిందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో విత్తన వేరుశనగను పంపిణీ చేస్తోందని ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ సాగు చేసుకుంటామని రైతులు తెలిపారు.

3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

రాయదుర్గంటౌన్ రాయదుర్గం, రూరల్ ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత భారీ వర్షం నమోదైంది. అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు ఏకదాటిగా కురిసింది. 35.6 మిలీమీటర్ల వర్షపాతం (3.5 సెంటీమీటర్లు) నమోదైనట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలంలో 25.8 మిల్లీమీటర్లు, కణేకల్లులో 17 మిల్లీమీటర్లు, బొమ్మనహాళ్‌లో 27.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి పట్టణంలోని అనేక లోతట్టు కాలనీల్లో రోడ్లపైకి వర్షపునీరు చేరింది.

పొంగి పొర్లుతున్న వంకలు

విడపనకల్లుమండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీగా వర్షం కురిసింది. దీంతో ఆదివారం వాగులు వంకలు, వరద నీటితో పోటెత్తాయి. మండలంలోని పాల్తూరు, గాజుల మల్లాపురం, పాలికి, ఆర్.కొట్టాల డొనేకల్లు వద్ద ఉన్న వంకలు పెద్ద ఎత్తున వరద నీటితో ఉధృతంగా పొంగి పొర్లింది. భారీ వర్షం కురవడంతో వ్యవసాయ పొలాల్లో సైతం నీరు నిలిచింది. ఉండబండ, పాల్తూరు గ్రామాల మధ్య వంకలు గంటల తరబడి వరద నీటితో పొంగి పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



కళ్యాణదుర్గం-బళ్లారి రహదారిపై విరిగిపడిన చెట్టు



బీడు భూముల్లో మొలిచిన పచ్చి గడ్డిని మేస్తున్న జీవాలు

వక్క,తమలపాకు రైతులకు అపార నష్టం

కుందుర్పి మండలంలోని ఈదురుగాలతో కూడిన భారీ వర్షానికి వక్క, తమలపాకు తోటలు నేలకూలాయి. దీంతో అపార నష్టం జరిగిందని రైతులు రామాంజనేయులు, మంజనాథ్, రాఘవేంద్ర, గోవిందప్ప తదితరులు తెలిపారు. కొలిమిపాళ్యం, కలిగొలిమి, జంబుగుంపల, వెంకటంపల్లి, నిజవళ్లి తదితర గ్రామాల్లో వక్క తమలపాకు తోటలు ఎకరాల కొద్దీ ఈదురు గాలులకు నేలకూలాయి. రూ. లక్షల్లో నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. పంటలు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందజేయాలని హార్టికల్చర్ అధికారి గౌషియాకు ఆదివారం బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు.

మూగ జీవాలకు ఊరట

కూడేరు మండల వ్యాప్తంగా 15 రోజులు నుంచి చిన్నపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. దీంతో బీడు భూముల్లో పచ్చి గడ్డి మొలచింది. మూగజీవాలకు కాస్త ఊరట లభించింది. మండల వ్యాప్తంగా గొర్రెలు, మేకలు లక్షకు పైగా , గేదెలు, ఆవులు, ఎద్దులు సుమారు 25 వేల వరకు ఉన్నాయి. గతేదాది తీవ్ర వర్షాభావంతో బీడు భూముల్లో గ్రాసం లేక మూగ జీవాలు విలవిలలాడాయి. గ్రాసం దొరక్క పశు పోషకులు, రైతులు ఇబ్బందులు పడ్డారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



చిన్నముష్టూరు వద్ద వేరుశనగ సాగుకు ముందు విత్తన శుద్ధి ఎలా చేయాలో రైతులకు తెలియజేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

ఉరవకొండ: పంట సాగులో విత్తన శుద్ధి కీలకం సరైన జాగ్రత్తలతో విత్తన శుద్ధి చేస్తే చీడపీడలు, తెగుళ్లను నివారించడంతో పాటు అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయ అధికారి శుభకర్ తెలిపారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ, ఇతర పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. వేరుశనగ సాగుచేసే రైతులు విత్తనశుద్ధి చేసుకుంటే నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని ఏఓ తెలిపారు.కిలో వేరుశనగ విత్తనానికి 9 గ్రామాల బావిస్టన్ లేదా ఎం.45 లేదా సాఫ్ పొడి కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. దీంతో మొలకలు బాగా పెరిగి ,తెగుళ్లను నివారిస్తుందన్నారు. విత్తన శుద్ధి తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంద్రాల నుంచి రక్షణ పొందుతాయని, దీంతో తెగుళ్ల , చీడపీడలు సోకకుండా చూసుకోవచ్చున్నారు. విత్తన శుద్ధికు తగిన మోతాదులో మాత్రమే మందులు వాడాలని, మోతాదుకు మించి ఉపయోగిస్తే విత్తనం మొలకెత్తే శాతం దెబ్బతింటుందన్నారు. విత్తన శుద్ధి చేసేటప్పుడు రైతులు ముఖానికి మాస్కులు, చేతికి బ్లౌజులు తప్పనిసరిగా వాడాలన్నారు. విత్తిన తర్వాత 25 లేదా 35 రోజుల్లోపే ఆకుపచ్చ తెగుళ్ల సోకకుండా కాంటఫ్ మందులు వాడాలన్నారు. 90 రోజుల తర్వాత బావిస్టన్ స్ప్రే చేస్తే ఆకు బలంగా ధృడంగా ఉండి మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు.

అల్లనేరేడు..ఆరోగ్యానికి ఎంతో మేలు



అల్లనేరేడు పండ్లు

రాయదుర్గంటౌన్: అల్లనేరేడు పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నిగనిగలాడే అల్లనేరేడు పండ్ల వల్ల ఆరోగ్యంతోపాటు ఆదాయం సమకూరుతుంది. అల్లనేరేడు పండ్లు తినడానికి పిల్లలు, పెద్దలు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. రుచిలోనే కాదు.. ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెప్తున్నారు. వ్యాధి నిరోధక శక్తి పెంపొందించడంతోపాటు షుగర్ వ్యాధిగ్రస్తులకు అల్లనేరేడు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. ఈ గింజలను పొడి రూపంలో చేసుకుని తింటే ఫలితం ఉంటుంది. అంతేకాక కడుపులో పేరుకు పోయిన మలినాలు బయటకు వెళ్లేందుకు ఈ పండ్లు దోహదపడతాయని ఆయుర్వేద వైద్యులు సైతం సూచిస్తున్నారు. ప్రస్తుతం అల్లనేరేడు పండ్ల సీజన్ ప్రారంభమైందన్నారు. స్థానికంగా బొమ్మనహాళ్ మండలం ఎల్‌బీ నగర్ ప్రాంతంతోపాటు కర్ణాటక నుంచి అల్ల నేరేడు పండ్లు తెచ్చి మార్కెట్‌లో అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో అల్లనేరేడు రూ.200 ప్రకారం విక్రయిస్తున్నారు.

బైబిల్ పాఠశాలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: పట్టణంలోని సీఎస్‌ఐ చర్చిలో 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించే విరామ బైబిల్ పాఠశాలను క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడూ చిన్ననాటి నుంచే పిల్లలను సన్మార్గంలో పయనింప జేయడానికి విరామ బైబిల్ స్కూల్ తోడ్పడుతుందన్నారు. మండలవ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ అధికారం

- ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు మించి ఫలితాలు
- ధీమా వ్యక్తం చేసిన మెట్టు గోవిందరెడ్డి



మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ఏపీలో మళ్లీ వైఎస్సార్‌సీపీ కే ప్రజలు పట్టం కట్టబోతున్నారని, ఈ నెల 9న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా రెండోసారి తప్పక ప్రమాణస్వీకారం చేస్తారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు మించి ఈనెల 4న ఎగ్జాట్‌పోల్ ఫలితాలు ఉంటాయన్నారు. ప్రజలు ఇచ్చే తుది తీర్పు వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

125–130 స్థానాల్లో ఫ్యాన్ సునామి..

రాష్ట్రంలో 125–130 అసెంబ్లీ, 20–23 పార్లమెంట్ స్థానాల్లో ఫ్యాన్ సునామీ సృష్టిస్తోందని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ప్రముఖ సర్వే సంస్థలన్నీ వైఎస్సార్‌సీపీకే అధికారం దక్కుతుందని కుండబద్దలకొట్టినా, టీడీపీ, ఎల్లో మీడియా మాత్రం వ్యతిరేకంగా ప్రచారం చేయడం సరికాదన్నారు. 4వతేదీన ఫలితాలు వెలువడిన తర్వాత అయినా నిర్ణయం మార్చుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో నమోదైన సైలెంట్ ఓటింగ్, మహిళా ఓటింగ్, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారంతా వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలిచారన్నారు. కూటమికి గెలుపు పగటి కలలుగానే మిగిలిపోతుందన్నారు. 2019 ఎన్నికల ముందు కూడా టీడీపీ ఇలాగే హంగామా చేసి, ఫలితాలొచ్చాక తోక ముడిచిందని గుర్తు చేశారు. రాయదుర్గంలోనూ భారీ మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దుర్గం కోటపై వైఎస్సార్‌సీపీ జెండా తప్పక ఎగురవేస్తామన్నారు. కూటమి సభ్యులు తనపై ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదన్నారు. ఎన్నికల కౌటింగ్‌కు సర్వం సిద్ధం అయ్యామన్నారు. టీడీపీ నాయకులు ఎంత రెచ్చగొట్టినా విజయం సాధించే వరకు సంయమనం పాటించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలు

- పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పావగడ: స్థానిక ఆగ్నేయ ఉపాధ్యాయుల విధాన పరిషత్ ఎన్నికలు సోమవారం జరగనున్నాయి. ఇందులో భాగంగానే తహసీల్దార్ సంతోష్‌కుమార్ ఆదివారం మాట్లాడుతూ తాలూకా కార్యాలయంలో పోలింగ్ సులభతరంగా ఉండడానికి రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. న్యా యాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 400 మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకోవచ్చన్నారు. అలాగే గ్రేడ్- 2 తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో 403 మంది ఓటర్లు ఓటు వేయవచ్చని వెల్లడించారు. మొత్తం ఓటర్లు 803 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఓటర్లందరికీ ఓటరు చీటీలు అందించామన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే వారు తప్పనిసరిగా ఓటరు చీటీలు తీసుకురావాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు.

ఘనంగా అపర ఏకాదశి

పామిడి: పట్టణ తగ్గుదేవాలయంలో ఉన్న అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం అపర ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు, అనంతరం భక్తులు విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రాకారోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామ స్మరణతో మార్మోగింది.

దశభుజ మహా గణపతికి పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నీలగిరి స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో నీలగిరి స్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబ వీధిలో కొలువైన నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, విశేషపూజలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

పండ్లమొక్కల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

కుందుర్పి: ఉపాధిహామీ పథకం నిధులతో డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం ద్వారా పండ్ల మొక్కలు సాగుచేసే రైతులు ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎం ఓబిరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ శర్మాస్ వలి తెలిపారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులు మాత్రమే అర్హులన్నారు. మండలానికి మూడు వందల ఎకరాల్లో పండ్లమొక్కలు సాగుచేసుకోవచ్చన్నారు. మామిడి, జామ, దానిమ్మ, కొబ్బరి, నేరేడు వంటి పండ్లమొక్కలు మెట్టభూముల్లో సాగుచేసుకోవచ్చన్నారు.

కార్తికేయునికి విశేష పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఉన్న సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు బంగారు ఆబరణాలతో పాటు, పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆకుపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద పారిశుధ్య పనులు



అనంతపురం జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో ఆదివారం జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రం, కేంద్రం ఆవరణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాలను శుభ్రం చేశారు. అదేవిధంగా జేఎన్‌టీయూ ఆవరణంలో చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేశారు. అనంతరం పిచ్చిమొక్కలు, రాళ్లను తొలగించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు



కంబదూరులో రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ బి.శ్రీనివాసులు

కంబదూరు: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు చేసినా, ఘర్షణలకు పాల్పడినా ఉపేక్షించేదిలేదని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి రౌడీషీటర్ ఓపెన్ చేస్తామని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ అవరణలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు నలుగురు కన్నా ఎక్కువ మంది గుంపులుగా చేరి, అల్లర్లు, గొడవలు చేసినా ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 30 పోలీసు యాక్ట్ కూడా అమలులో ఉందని, విజయోత్సవ ర్యాలీలు,సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ రోజు ఏ పార్టీ విజయం సాధించినా బాణాసంచాలు కాల్చడం చేయరాదన్నారు. బైక్‌ల సైలెన్సర్ తీసి, వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రౌడీషీట్లు ఓపెన్ చేయడంతో పాటు జిల్లా బహిష్కరణ లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలియజేశారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు

కళ్యాణదుర్గం రూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అన్ని పార్టీ రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ కళ్యాణదుర్గం డివిజన్‌లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో గెలిచిన పార్టీ అభ్యర్థులు, నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించరాదన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటించాల్సిన విధివిధానాలపై పలు సూచనలు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంలో బాణాసంచా కాల్చడం చేయరాదన్నారు.

అల్లర్లు చేస్తే చర్యలు తప్పవు



శెట్టూరులోని వివిధ పార్టీ నాయకులతో మాట్లాడుతున్న దృశ్యం

శెట్టూరు: ఎన్నికల ఫలితాల వేళ అల్లర్లు, కొవింపు చర్యలకు పాల్పడవారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.

అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదన్నారు. ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నడుచుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ మంజునాథ, నాయకులు సోమనాథరెడ్డి, హరినాథరెడ్డి, బొమ్మజ్జి, రమేష్, ఎమ్మెస్ రాయుడు, తిప్పేస్వామి, రామకృష్ణ, వీరాంజనేయులు, రామాంజనేయులు, వీరభద్రప్ప, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.